క్లుప్తంగా

30 లోపు ఈ-పంట నమోదు పూర్తి కావాలి

పెదపూడి: ఈ-పంట నమోదును రైతులు ఈ నెల 30 తేదీ లోపు చేయించుకోవాలని వ్యవసాయశాఖ మండలాధికారి ఎస్.సత్యప్రసాద్ అన్నారు. పెదపూడిలో జరుగుతున్న ఈ-పంట నమోదు ప్రక్రియను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 18,150 ఎకరాల్లో రైతులు వరి పంట సాగుచేస్తున్నారన్నారు. దానిలో సుమారు 11,797 ఎకరాల్లో అంటే 65 శాతం నమోదు పూర్తయిందన్నారు. అలాగే నానో యూరియా ఎరువుల వినియోగంపై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు.

త్రిముఖ లింగేశ్వరస్వామికి పూజలు

బిక్కవోలు: కొంకుదురు బుడిత మామిడి లోని బాలా త్రిపుర సుందరీ సమేత త్రిముఖలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తరలివచ్చిన భక్తులకు దాతల సహకారంతో ఆలయం కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిమీటీ చైర్మన్ పడాల వెంకటరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీ4పై రెండు బ్యాచ్‌లకు నేడు శిక్షణ

బిక్కవోలు: మండలంలోని సచివాలయం సిబ్బందికి రెండు బ్యాచ్‌లలో పీ4పై శిక్షణ ఉంటుందని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ మంగళవారం ఉదయం 10.30 నుంచి బిక్కవోలు 1, 2, 3, 4, బలభద్రపురం 1, 2, 3, కాపవరం, ఇలపల్లి, రంగాపురం సచివాలయాల్లో పనిచేసే 75 సిబ్బంది మొదటి విడతలో శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం మధ్యాహ్నం 2.30 నుంచి ఆరికరేవల, మెల్లూరు, తొస్సిపూడి, పందలపాక 1, 2, కొంకుదురు 1, 2, కొమరిపాలెం 1, 2, ఊలపల్లి 1, 2 సచివాలయాల్లో పనిచేస్తున్న 83 మందికి రెండో విడత శిక్షణ ఉంటుందని తెలిపారు.

పంచాయతీ వార్డు సభ్యుడి మృతి

రంగంపేట: పెదరాయవరం పంచాయతీ వార్డు సభ్యుడు సానిపిని వీర వెంకట సత్యనారాయణ (రాంబాబు) (55) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన పంచాయతీ ఎన్నికల్లో గ్రామంలోని నాలుగో వార్డు నుంచి పోటీ చేసి విజయం సాధించారు. గతంలో పెదరాయవరం ఉప సర్పంచ్‌గా కూడా పని చేశారు. రాంబాబు మృతిపై వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, అనపర్తి మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు మాచిన గోవింద రాజు, పెదరాయవరం గ్రామ ఎంపీటీసీ మాచిన మమతారాణి, గ్రామ సర్పంచ్ బరగటి సుజాత నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ మద్దిపాటి వీర్రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సంతాపం తెలిపారు.

రోడ్డుపై ఇసుక తొలగింపు



మునికూడలి వద్ద రోడ్డుపై ఇసుకను తొలగిస్తున్న కూలీలు

సాక్షి ఇంపాక్ట్

సీతానగరం: మండలంలోని మునికూడలి ర్యాంపు వద్ద రాజమహేంద్రవరం – సీతానగరం ఆర్అండ్‌బీ రోడ్డుపై ఉన్న ఇసుకను సోమవారం ర్యాంపు నిర్వాహకులు తొలగించారు. ఆ సమస్యపై సాక్షి పత్రికలో 'ఇసుకతో ప్రమాదాల రిస్కు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించారు. వెంటనే కూలీలను ఏర్పాటు చేసి పారలతో ఇసుకను తొలగించారు. అనంతరం రోడ్డును నీటితో తడిపారు. దీంతో రాకపోకలకు మార్గం సుగమమైంది.

యోగా శిక్షణ ప్రారంభం



యోగా శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

పెదపూడి: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని జి.మామిడాడ గ్రామానికి చెందిన యోగా గురువు సాయి వెంకటేశం అన్నారు. ఆ గ్రామంలోని సూర్యనారాయణ మూర్తి దేవాలయంలో సోమవారం భాస్కర కృష్ణ చారిటబుల్ (బీకేసీ)ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగా శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయి వెంకటేశం మాట్లాడుతూ పది రోజుల పాటు శిక్షణ ఇస్తామని, విజయదశమి రోజు యోగా పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. మొదటి రోజు 45 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఫౌండర్ అండ్ వైస్ చైర్మన్ నల్లమిల్లి సురేష్ రెడ్డి (లక్ష్మం) తదితరులు పాల్గొన్నారు.

దసరా శోభ



రంగంపేటలో బాలా త్రిపుర సుందరిగా ఉమా మహేశ్వరి అమ్మవారు



సంపరలో బాలా త్రిపుర సుందరిగా విజయ దుర్గాదేవి

- శరన్నవరాత్ర మహోత్సవాలు ప్రారంభం
- ఆలయాల్లో భక్తుల సందడి
- మంటపాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



చక్రద్వారబంధంలో..



అనపర్తిలో అమ్మవారికి నమస్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు

అనపర్తి: దసరా శరన్నవరాత్ర మహోత్సవాలు సోమవారం అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రముఖ దేవాలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలను సుందరంగా ముస్తాబు చేశారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు అనపర్తి గ్రామ దేవత వీరుళ్లమ్మ ఓం శక్తి సత్సంగం సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే శారద శరన్నవరాత్ర ఉత్సవాలను కలశ స్థాపన చేసి ప్రారంభించారు. సుమారు ఈ పీఠంలో గురుభవాని వెంకటరమణారెడ్డి, అర్చక స్వామి దుప్పలపూడి శివస్వామి ఆధ్వర్యంలో నియమ నిష్ఠలతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ ఏడాది ఇప్పటి వరకు సుమారు 250 మంది భక్తులు భవానీ మాలధారణ చేశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణరెడ్డి దంపతులు పీఠంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి పీఠం ఏర్పాటుకు సహకరించిన కర్రి రామారెడ్డి (చిన్న), గంగాభవాని దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులను ఘనంగా సన్మానించారు.

పెదపూడి మండలంలో..

పెదపూడి: మండలంలోని గ్రామాల్లో శరన్నవరాత్ర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సంపర, పెదపూడి, జి.మామిడాడ, పెద్దాడ, రామేశ్వరం, ఏపీత్రయం, కాండ్రేగుల, పుట్టకొండ తదితర గ్రామాల్లో అమ్మవారి మంటపాలు ఏర్పాటు చేసి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ప్రముఖ ఆలయాల్లో పూజలు జరిపారు. మొదటి రోజు అమ్మవారు బాలాత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు.

బిక్కవోలు మండలంలో..

బిక్కవోలు: చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా దేశ వ్యాప్తంగా జరుపుకొనే దసరా ఉత్సవాలు సోమవారం మండల వ్యాప్తంగా ఘనంగా ప్రారంభమయ్యాయి. బిక్కవోలు ప్రాచీన గోలింగేశ్వస్వామివారి ఆలయంలో కొలువైన పార్వతీ అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఆలయ ఆవరణలో గణపతి పూజ, చండీ యాగం నిర్వహించారు. బలభద్రపురం షిర్డీ సాయినాథుని ఆలయం వద్ద దేవి నవరాత్ర సహిత శతచండీయాగం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపారు. పందలపాక, కొమరిపాలెం, బలభద్రపురం, ఊలపల్లి, కొంకుదురు, తొస్సిపూడి, ఆరికరేవుల, మెల్లూరు, ఇల్లపల్లి, రంగాపురం, కాపవరం తదితర గ్రామాలలో అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

రంగంపేట మండలంలో..

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేటలోని దేవీ సెంటర్ ఆలయంలో అమ్మవారిని బాలా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. ఆలయ అర్చకుడు నాగేంద్ర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. అంతకు ముందు అమ్మవారిని వెండి, బంగారు ఆభరణాలు, గజ మాలలతో సుందరంగా అలంకరించారు.

- చంద్రేడులోని కాత్యాయనీ సమేత చంద్రశేఖర స్వామి, శ్రీదేవి కనకదుర్గ ఆలయాల్లో అమ్మవారిని తొలిరోజు బాలా త్రిపుర సుందరిగా అలంకరించారు. అనంతరం కుంకుమ పూజలు నిర్వహించారు. వడపప్పు, చనివిడి, పానకం, పులిహోర నైవేద్యం సమర్పించారు.
- దొంతమూరు మెయిన్ రోడ్డులో విజయదుర్గాదేవి ఆలయ 7వ నవరాత్ర మహోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. గ్రామస్తులు అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చి కలశ స్థాపన చేశారు. అర్చకుడు జటప్రోలు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణలు చేశారు.
- ఈలకొలనులోని ముత్యాలమ్మతల్లి ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. వడిశలేరు, దొడ్డిగుంట, సింగంపల్లి, కోటపాడు, ముకుందవరం గ్రామాలలో అంగరంగ వైభవంగా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

సీతానగరం మండలంలో..

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం వెలమపేట రామాలయంలో దేవీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి చొక్కాకుల రత్నాజీ, దుర్గ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాపాక పంచాయతీ పరిధిలోని శ్రీరామనగరం, సింగవరం పంచాయతీ పరిధి నాగరత్నం కాలనీ వద్ద కనకదుర్గమ్మ ఆలయాల్లో పూజలు జరిపారు.

- పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం, చినకొండేపూడి, సీతానగరం, రఘుదేవపురం, ముగ్గళ్ల, కూనవరం, వెదుళ్లపల్లి, ఇనుగంటివారిపేట, మునికూడలి, బొబ్బిల్లంక, కాటవరం, ములకల్లంక, ఉండేశ్వరపురం, మిర్తిపాడులో వేడుకలు ప్రారంభమయ్యాయి.

108 చీరలతో వాసవీమాతకు అలంకరణ

రాజానగరం: శరన్నవరాత్రి ఉత్సవాలు రాజానగరం మండలంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. రాజానగరంలోని రావుల చెరువు గట్టున కొలువైన వాసవీ కన్యకా పరమేశ్వరిని 108 నూతన చీరలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో చేసిన ఈ అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

- పురాతన ప్రసిద్ధి గాంచిన స్థానిక రాజరాజేశ్వరీదేవి ఆలయంతో పాటు షిరిడీ సాయిబాబా ఆలయంలో సరస్వతీ మాత, గ్రామ దేవత ముత్యాలమ్మ ఆలయంలో దసరా పూజలు ప్రారంభమయ్యాయి.
- చక్రద్వారబంధంలోని దేవీచౌక్‌లో జగన్మాతకు భవానీ భక్తులు సహస్ర కుంకుమార్చన జరిపారు. అర్చకులు శ్రీకాంత్‌శర్మ, హర్ష ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది.



పందలపాక రామాలయం వద్ద కొలువైన శ్రీదేవి అమ్మవారు



చంద్రేడులో బాలా త్రిపుర సుందరిగా శ్రీదేవి కనకదుర్గమ్మ



వడిశలేరులో విజయ దుర్గాదేవి



కాటవరంలో బాలా త్రిపుర సుందరి అలంకరణలో అమ్మవారు



రాజానగరంలో వాసవీమాతకు చీరలతో అలంకరణ

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలి



రాజమహేంద్రవరంలో మాజీ ఎంపీ భరత్‌రామ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ముక్తేశ్వరరావు

పెదపూడి: వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పని చేయాలని కార్యకర్తలకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి, రాజమహేంద్రవరం, గోపాలపురం అసెంబ్లీ నియోజకవర్గాల పరిశీలకుడు అద్దంకి ముక్తేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆయన రాజమహేంద్రవరంలో సోమవారం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ భరత్‌రామ్‌ను కలిశారు. అనంతరం నియోజకవర్గంలో పర్యటించారు. కార్యక్రమంలో పెదపూడి మండల మాజీ ఎంపీపీ కర్రి శ్రీవెంకటరెడ్డి, సర్పంచుల సమాఖ్య మండలాధ్యక్షుడు కోసూరి వాసు తదితరులు పాల్గొన్నారు.

26 వరకూ ఆధార్ ప్రత్యేక శిబిరాలు

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల 26 వరకూ ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామని ఇన్‌చార్జి ఎంపీడీవో కేవీఎస్ఎస్ మూర్తి సోమవారం తెలిపారు. మంగళ, బుధవారాల్లో బొబ్బిల్లంక, 24న మిర్తిపాడు, 26న ముగ్గళ్ల గ్రామ సచివాలయాల్లో జరుగుతాయన్నారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వయోజనుల్లో అక్షరాస్యతను పెంచేందుకు కృషి



పెదపూడిలోని అంగన్‌వాడీ కేంద్రంలో రాత్రి బడిని ప్రారంభించిన కో ఆర్డినేటర్ రాజేష్

పెదపూడి: వయోజనుల్లో అక్షరాస్యతను పెంచేందుకు అక్షర ఆంధ్ర (ఉల్లాస్) కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు ఆంధ్రప్రదేశ్ ఉల్లాస్ రాష్ట్ర కో ఆర్డినేటర్ రాజేష్ అన్నారు. పెదపూడిలోని జనార్దనస్వామి ఆలయం, సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాల వద్ద సోమవారం అక్షరాస్యత రాత్రి బడులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజేష్, జిల్లా ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్, ఉల్లాస్ స్పెషల్ ఆఫీసర్ పోశయ్య, స్టాటికల్ ఆఫీసర్ ఆనంద బాబు హాజరయ్యారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ మేడపాటి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ రానున్న మూడేళ్లలో వయోజనులను నూరు శాతం అక్షరాస్యులుగా చేయాలనేది ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. మండలంలో ఇప్పటి వరకు 8 కేంద్రాలను ప్రారంభించారని, ఇంకా 180 కేంద్రాలు ప్రారంభించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఈజీఎస్ ఏపీవో సత్యనారాయణ, వెలుగు సీసీలు గంధం రమేష్, సూర్యకుమారి, శ్రీనివాసు పాల్గొన్నారు.

కలువ పువ్వుల కోసం చెరువులో దిగి వ్యక్తి మృతి

కోరుకొండ: కలువ పువ్వుల కోసం చెరువులో దిగిన వ్యక్తి ప్రమాదవశాత్తూ మృతి చెందిన సంఘటన మండలంలోని కోటిలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. సీతానగరానికి చెందిన పెంటా అప్పారావు (60) కూలి పనులు చేసుకుంటూ జీవిస్తుంటాడు. అలాగే కలువ పువ్వులు, తామర ఆకులను సేకరించి విక్రయిస్తూ ఉంటాడు. దసరా ఉత్సవాల సందర్భంగా కలువ పువ్వులను సేకరించేందుకు ఆదివారం మధ్యాహ్నం కోటి గ్రామంలోని చెరువులోకి దిగాడు. దానిలోని ఊబిలో మునిగిపోయాడు. ఆ సమయంలో అక్కడ ఎవ్వరూ లేకపోవడంతో ఈ విషయాన్ని గమనించలేదు. రాత్రియినా అప్పారావు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు సోమవారం కోటి గ్రామంలో చెరువు వద్ద గాలించారు. విషయంపై పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో చెరువులో గాలించగా అప్పారావు మృతదేహం బయటపడింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, మృతదేహాన్ని రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించినట్టు ఎస్సై నాగార్జున తెలిపారు.

జీఎస్టీ సంస్కరణలతో పేదలకు ప్రయోజనం



జీఎస్టీ ర్యాలీలో పాల్గొన్న ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం సిటీ: జీఎస్టీ సంస్కరణలతో పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ఈ మేరకు సోమవారం దేవీచౌక్‌లో బీజేపీ శ్రేణులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ జీఎస్టీ సంస్కరణలు తీసుకు రావడం ఆనంద దాయకమన్నారు. ఇప్పుడు జీఎస్టీ 2.0 ద్వారా నాలుగు శ్లాబులున్న జీఎస్టీని రెండు శ్లాబుల్లోకి తెచ్చారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి బొమ్ముల దత్తు, నాయకులు ఏపీఆర్ చౌదరి, క్షత్రియ బాల సుబ్రహ్మణ్యం సింగ్, హీరాచంద్ జైన్, యానాపు ఏసు తదితరులు పాల్గొన్నారు.

చాంబర్‌కు ఇద్దరు సభ్యుల నియామకం



చాంబర్ ఆఫ్ కామర్స్‌కు ఎన్నికైన సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: ది రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ బిల్డింగ్ ట్రస్ట్ నుంచి ది రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్‌కు ఎక్స్అఫిషియో ఉపాధ్యక్షుడిగా కనకాల రాజాను, నామినేటెడ్ ట్రస్టీగా యక్కల వీర నాగేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ విషయాన్ని ది రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ బిల్డింగ్ ట్రస్ట్ కార్యదర్శి పచ్చిగోళ్ల సురేష్ కుమార్ సోమవారం ప్రకటించారు. మెయిన్ రోడ్డులోని చాంబర్ కార్యాలయంలో అధ్యక్షుడు తవ్వా సూర్యనారాయణమూర్తి (రాజా) అధ్యక్షత లైఫ్ ట్రస్టీల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌరవ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వంటెద్దు సూరిబాబు, మాజీ అధ్యక్షులు బాలనాగు బల్లేషుగుప్తా, నందెపు శ్రీనివాస్, బూర్లగడ్డ వెంకట సుబ్బారాయుడు, లక్ష్మీనారాయణ జవ్వార్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపై కుమారుడి దాడి

బిక్కవోలు: అన్నం తక్కువ పెట్టావంటూ తల్లిపై ఓ కొడుకు దాడి చేసి గాయపర్చాడు. ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. బలభద్రపురం గ్రామానికి చెందిన గొర్రెల రమణమ్మకు భర్త , చిన్నకొడుకు చనిపోయారు. దీంతో పెద్ద కుమారుడు శ్రీనివాస్‌తో కలిసి జీవిస్తోంది. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో ఇంటి వచ్చిన కొడుకుకి భోజనం పెట్టింది. అయితే అన్నం తక్కువ పెట్టావంటూ ఆమెపై శ్రీనివాస్ దాడి చేసి గాయపర్చాడు. వెంటనే రమణమ్మను బంధువులు చికిత్స కోసం అనపర్తి ఏరియా ఆసుపత్రి తీసుకువచ్చారు. ఆసుపత్రి సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

దాడి కేసులో నిందితుడికి రిమాండ్

సీతానగరం: మునికూడలి చెందిన నరుకుర్తి రామలక్ష్మి, ఆమె భర్తను దాడి చేసిన ఘటనలో నిందితుడు ఇందుగుమిల్లి ప్రసాద్‌కు కోర్టు రిమాండ్ విధించిందని ఎస్సై డి.రామ్ కుమార్ సోమవారం తెలిపారు. ప్రసాద్‌ను ఈ నెల 21 అరెస్ట్ చేసి రాజమహేంద్రవరం 7వ అడిషనల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పర్చగా 14 రోజులు రిమాండ్ విధించారని, సెంట్రల్ జైలుకు తరలించామని తెలిపారు.

లంచం అడుగుతున్నారని ఫిర్యాదు

సీతానగరం: పురుషోత్తపట్నంలో కౌలు కార్డులు కావాలంటే వీఆర్వో రూ.2 వేలు డిమాండ్ చేస్తున్నారని నల్లూరి హరిబాబు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇన్‌చార్జి ఎంపీడీవో కేవీఎస్ఎస్ మూర్తికి ఫిర్యాదు చేశారు.

మహిళా సంరక్షణే లక్ష్యం



కొమరిపాలెంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

బిక్కవోలు: మహిళా సంరక్షణే లక్ష్యంగా సేవలు అందిస్తున్నామని కొంకుదురు పీహెచ్‌సీ వైద్యురాలు జి.విజయలక్ష్మి అన్నారు. స్వస్త్ నారీ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం కొమరిపాలెంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు వైద్య పరీక్షలు జరిపారు. కార్యక్రమంలోని సర్పంచ్ వాసంశెట్టి రవి కుమార్, ఉప సర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరాలతో మెరుగైన సేవలు



పారిశుధ్య కార్మికుడికి వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

పెదపూడి: వైద్య శిబిరాల ద్వారా మెరుగైన సేవలు పొంది, ఆరోగ్యవంతంగా ఉండాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ మేడపాటి సత్యనారాయణరెడ్డి అన్నారు. పెద్దాడ గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు, జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. శిబిరంలో బీపీ, సుగర్, హిమోగ్లోబిన్, గుండె, చర్మ సంబంధ వ్యాధులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి మన్యం శ్రీనివాస చౌదరి, ఏఎన్ఎం వెంకటలక్ష్మి, ఎల్ఎల్‌హెచ్‌పీ బీర సుకుమార్, పురుషోత్తం, హెచ్ఎం మూర్తి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రాజానగరం: జాతీయ రహదారిపై దివాన్ చెరువు జీరో పాయింట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి బొమ్మూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరంలోని మోడల్ కాలనీకి చెందిన బత్తుల తారకరాజు (27) తన స్నేహితులతో కలిసి మూడు బైకులపై ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో రాజానగరం వైపు నుంచి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై దివాన్ చెరువు జీరో పాయింట్ వద్ద ప్రమాదానికి గురయ్యారు. పుల్లా గోపీనాథ్ డ్రైవ్ చేస్తున్న బైక్‌పై వెనుక తారక రాజు కూర్చున్నాడు. గోపీనాథ్ అతి వేగంతో డ్రైవింగ్ చేస్తూ లారీ ఢీని కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తారకరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి బత్తుల కృష్ణవేణి సోమవారం ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థినులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన బీసీ గురుకులం విద్యార్థినులు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో బొమ్మూరులోని మహాత్మా జ్యోతీతిరావు పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అమిత (పదో తరగతి) 1600 మీటర్ల పరుగుపందెంలో ప్రథమ, హైజంప్‌లో ప్రథమ, 600 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానాలు, గాయత్రి (పదో తరగతి) షాట్‌పుట్, జావెలిన్ త్రోలో ప్రథమ, హర్షశ్రీ (పదో తరగతి) షాట్‌పుట్, జావెలిన్ త్రోలో ద్వితీయ, ఉమాదేవి(తొమ్మిదో తరగతి) షాట్‌పుట్ బ్యాక్ త్రోస్ ద్వితీయ, ఉమ(8వ తరగతి) 600 మీటర్ల పరుగుపందెం, లాంగ్ జంప్‌లో ద్వితీయ, నందిని (9వ తరగతి) హైజంప్, 600, 1600 మీటర్ల పరుగుపందేల్లో ప్రథమ, శ్యామల (8వ తరగతి) 600 మీటర్ల పరుగుపందెంలో తృతీయ స్థానాలు సాధించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ఆ విద్యార్థినులను, పీఈటీ రమ్యను ప్రిన్సిపాల్ అఖిల, ఉపాధ్యాయులు అభినందించారు.

గోదావరిలో యువకుడి గల్లంతు

కంబాలచెరువు: గోదావరిలో పడి మండపేటకు చెందిన యలమంచిలి సురేంద్రకుమార్ (22) సోమవారం గల్లంతయ్యాడు. ఆ యువకుడు గోదావరిలో స్నానం చేసేందుకు రాజమహేంద్రవరంలోని పుష్కర్‌ఘాట్‌కు వచ్చాడు. స్నానం చేస్తూ ప్రమాదవశాత్తూ గల్లంతయ్యాడు. అక్కడే ఉన్న సులభ్ కాంప్లెక్స్ సిబ్బంది చూసి వెంటనే పోలీసులకు తెలిపారు. దీనిపై మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. గల్లంతైన యువకుడి కోసం గాలిస్తున్నారు.